దళారుల బెడదను తొలగించాలి

పీవీఎల్ నర్సింహరాజు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: కూటమి ప్రభుత్వంలో రైతులు దగా పడతున్నారని, దళారుల బెడద పెచ్చుమీరుతుందని, మద్దతు ధర లభించక విలవిలలాడుతోన్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు ఆవేదన వ్యక్తంచేశారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గురువారం మండల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంటలు పండించే రైతులు దళారుల చేతుల్లో కీలు బొమ్మలుగా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉంటున్నాయన్నారు. అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. పది నెలల కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని మండిపడ్డారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉందని నర్సింహరాజు ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని వరి రైతులతో పాటు మినుము, జొన్న, కంది, పెసర, సెనగ వంటి అపరాలకు గిట్టుబాటు ధర లభించడంలేదని, మిర్చి రైతులు లబోదిబో మంటుంటే ప్రభుత్వానికి వికారం పుడుతుందని నర్సింహరాజు ఆవేదన వ్యక్తంచేశారు.

అయినకాడికి ధాన్యం అమ్మకాలు

ఖరీఫ్ ధాన్యం పలు చోట్ల అయినకాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పీవీఎల్ నర్సింహరాజు ధ్వజమెత్తారు. మద్దతు ధర దక్కక, ధాన్యం కొనుగోలు చేసే మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులు తట్టుకోలేక రైతన్నలు విలవిల్లాడిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. చితుకు, పసరు, నెంబు అంటూ మద్దతు ధరల్లో కోతలు విధించి మిల్లర్లు అడ్డంగా నొల్లేసినా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో రబీలో రైతన్న తన పంటను అమ్ముకునే స్వేచ్ఛను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. దళారులపై కఠిన చర్యలు తీసుకుని, మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆకివీడు, ఉండి, కాళ్ల వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య, పీవీఆర్కే అంజనేయరాజు, గణేశ్న రాంబాబు, ఆకివీడు పట్టణ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్, మంతెన సునిల్ వర్మ, గుండా బత్తుల సుబ్బారావు, గలావిల్లి ధనుంజయ్, కరిమెరక శివ నాగరాజు, వేగేశ్న జయరామకృష్ణంరాజు, వేగేశ్న నాగరాజు, గుండు నాగేశ్వరరావు, చెల్లబోయిన పాపారావు, సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, పాలా రాంబాబు, పాలా రాధాకృష్ణ, గుంటుపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్నిమాపక వ్యర్థ పరికరాల వేలం



వ్యర్థాలను వేలం వేస్తున్న జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు

ఆకివీడు: స్థానిక అగ్నిమాపక కేంద్ర కార్యాలయంలో పనికిరాని వస్తువుల్ని గురువారం కార్యాలయ ఆవరణలో జిల్లా అగ్నిమాపక అధికారి బి. శ్రీనివాసరావు సమక్షంలో వేలం వేశారు. వేలం పాటలో రూ.68,100లు జీఎస్టీతో కలిపి విజయవాడకు చెందిన భారప్రసాద్ పాడుకున్నారు. వేలం పాటలో పోలవరం, రాజమండ్రి, ఏలూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల నుండి 24 మంది పాల్గొన్నారు. స్థానిక అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల పారిశుద్ధ జిల్లా సమన్వయకర్త కె.కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలు, రాగిపాడి, బెల్లం పొడి నిల్వలను పరిశీలించారు. అలాగే మరుగుదొడ్లలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

వృద్ధాశ్రమానికి ఫర్నిచర్ అందజేత



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక గునుపూడిలోని ప్రేమాలయం వృద్ధాశ్రమానికి గురువారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ. 60 వేల విలువైన ఫర్నిచర్ అందజేశారు. మానవత భీమవరం శాఖ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు, ఎగ్జిక్యూటివ్ అల్లు శ్రీనివాస్, కో–చైర్మన్ కారుమూరి నర్సింహమూర్తి, కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మినిస్టర్ వైట్ షోరూమ్ ప్రారంభం



వస్త్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

భీమవరం: పట్టణంలో మినిస్టర్ వైట్ షోరూమ్‌ను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు గురువారం ప్రారంభించారు. పీపీ రోడ్డులోని లూథరన్ చర్చి సమీపంలో ఈ షోరూమ్ ఏర్పాటు చేశారు. కంపెనీ సీఈవో సురేష్ సుబ్రహ్మణ్యం తమ కంపెనీకి దేశవ్యాప్తంగా 40 షోరూమ్‌లు ఉన్నాయని, ఏపీలో ఇది ఆరోదని వివరించారు. వైట్ షర్ట్స్‌తో పాటు కలర్ షర్ట్స్, సిల్క్, లినెన్ షర్ట్స్ మా ప్రత్యేకత అని పేర్కొన్నారు.

ఉపాధి హామీ వేతనాలు పెంచాలి



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

భీమవరం అర్బన్: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో 200 పనిదినాలు, దినసరి కూలి రూ. 500 పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఇంజేటి శ్రీనివాస్, ఎం. ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని తాడేరు గ్రామంలో గురువారం నిర్వహిస్తున్న ఉపాధి పనులను సీఐటీయూ జిల్లా నాయకులు ఇంజేటి శ్రీనివాస్, ఎం.ఆంజనేయులు పర్యవేక్షించి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. పలువురు కూలీలు తమ గ్రామంలో పట్టణంలో విలీనమైనందున ఉపాధి పనులు చూపించడం లేదని, పనులు ప్రారంభమై నెల గడుస్తున్నా డబ్బులు పడలేదని సీఐటీయూ జిల్లా నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఉపాధి పనిదినాలు, వేతనాలు పెంచాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో త్రిమూర్తులు, అనంత లక్ష్మి, సుబ్బలక్ష్మి, సందురమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పద్దాల వెంకమ్మ జాతర మహోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో పద్దాల వెంకమ్మ

వీరవాసరం: మండలంలోని నౌడూరు జంక్షన్‌లో ఉన్న పద్దాలవెంకమ్మ వారి 36వ జాతర మహోత్సవాలు ఈ నెల 29 నుంచి 30 వరకు నిర్వహిస్తామని ఆలయ నిర్మాత పెనుమత్స సూర్యనారాయణ రాజు గురువారం తెలిపారు. 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు అమ్మవార్ల జాతర మహోత్సవం గరగనృత్యాలతో, బాణసంచా కాల్పుల మధ్య అత్యంత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 30వ తేదీ ఉదయం 10 గంటలకు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అనంతరం అఖండ అన్న సమారాధన కార్యక్రమం పెద్ద ఎత్తున చేపడతామన్నారు. భక్తులంతా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

ఉప సర్పంచ్ ఉప ఎన్నికలు ప్రశాంతం

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం ఉపసర్పంచ్ అనివార్య కారణాలతో రాజీనామా చేయడంతో గురువారం ఎన్నిక నిర్వహించారు.ఈ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి, ఈవోపీఆర్డీ సీఎస్‌వీ రెడ్డి తెలిపారు. ఉపసర్పంచ్‌గా గ్రామానికి చెందిన 2వ వార్డు సభ్యుడు ముగ్గళ్ళ సత్యనారాయణ (సత్తిబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గ్రామ పంచాయితీలో మొత్తం 12 మంది వార్డు సభ్యులుండగా వారిలో ఒకరు గల్ఫ్ దేశం వెళ్ళిన కారణంగా ఒక స్థానం ఖాళీ అయ్యింది. మిగిలిన 11 మంది సభ్యుల్లో హాజరైన ఏడుగురు సభ్యులు, సర్పంచ్ సత్యనారాయణకు మద్దత్తు తెలపడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. అనంతరం వార్డు సభ్యులు,గ్రామ సర్పంచ్ సూరవరపు కనకదుర్గ అభినందనలు తెలిపారు.

పెర్కిపాలెంలో..

వీరవాసరం: మండలంలోని పెర్కిపాలెం ఉపసర్పంచ్‌గా చింతాడ మంగారావు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉప సర్పంచ్‌గా పనిచేసిన ఇంటి రామ్మోహనరావు రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఒప్పందంలో భాగంగా చింతాడ మంగారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన మంగారావను పలువురు అభినందించారు. సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గౌరగనమూడిలో..

పాలకోడేరు: మండలంలోని గౌరగనమూడి గ్రామ ఉప సర్పచంచ్‌గా దిడ్ల నిర్మలను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సచివాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో దిడ్ల నిర్మలకు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఈఓపీఆర్డీ రామప్రసాద్ ధ్రువీకరణ పత్రాన్ని అందించారు గతంలో ఉపసర్పంచ్ పదవి కాలం సర్దుబాటు చేసుకోవడంతో గత రెండున్నర సంవత్సరాలుగా గూడూరి రామాంజనేయులు ఉపసర్పంచ్ గా పనిచేశారు. తదనంతరం ఒప్పందం ప్రకారం ఆయన రాజీనామా చేయడంతో ఎన్నిక నిర్వహించారు. సర్పంచ్ గొట్టుముక్కల శివాజీ రాజు, మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు పంచాయతీ కార్యదర్శి సరళ తదితరులు నిర్మలను అభినందించారు.



భీమవరం అర్బన్: ఎల్‌వీఎన్‌పురంలో కన్యాకుమారికి నియామక పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

భీమవరంలో..

భీమవరం అర్బన్: మండలంలో తుందుర్రు, ఎల్‌వీఎన్‌పురం, గూట్లపాడు, గొల్లవానితిప్ప, కరుకువాడ బేతపూడి గ్రామాల ఉప సర్పంచ్‌ల ఉప ఎన్నిక గురువారం ప్రశాంతంగా సాగింది. భీమవరం, గణపవరం మండలాల ఈఓపీఆర్డీలు నామేశ్వరరావు, పీవీ సత్యనారాయణలతో పాటు మరో 3 మండలాల ఈఓపీఆర్డీలు ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గొల్లవానితిప్ప నూతన ఉప సర్పంచ్‌గా గుద్దటి సురేష్ (చిట్టి) (జనసేన సానుభూతిపరుడు), తుందుర్రు నూతన ఉప సర్పంచ్‌గా గోగులమండ సుజనాకుమారి (వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలు), ఎల్‌వీఎన్ పురం నూతన ఉప సర్పంచ్‌గా రామాని కన్యకుమారి (వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలు), గూట్లపాడు నూతన ఉప సర్పంచ్‌గా కొప్పర్తి సత్తిపండు (జనసేన సానుభూతిపరుడు), కరుకువాడ బేతపూడి నూతన ఉప సర్పంచ్‌గా బుంగా పండు (జనసేన సానుభూతిపరుడు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో ఎన్నికల అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్‌లను గ్రామ సర్పంచ్‌లు ఆరేటి వెంకట సత్య వీరాస్వామి నాయుడు (పెద్దబ్బు), కేతా నాగబాబు, చిల్లే వెంకటేష్, ఒడుగు ముత్యాలరాజు అభినందించారు.



వీరవాసరం: పెర్కిపాలెంలో చింతాడ మంగారావును అభినందిస్తున్న దృశ్యం

మెగా జాబ్‌మేళాలో 325 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాలో ఇంటర్వ్యూలు చేస్తున్న దృశ్యం

భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భీమవరం డాక్టర్ సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగాజాబ్‌మేళాలో 325 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. జాబ్‌మేళాకు ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి సుమారు 1,800 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. జాబ్‌మేళాను ప్రారంభించిన కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ మాట్లాడుతూ నిరుద్యోగులు ఉద్యోగావకాశాల కోసం కంపెనీల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఏర్పాటు చేస్తున్న జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఈఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ లోక్‌మాన్ మాట్లాడుతూ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఎస్‌డీఓ ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ, ఎండీ సలీమ్‌ఖాన్, ఎస్.నిర్మల, వీవీరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చడం క్రూరత్వం



బొండాడ పంచాయితీ వద్ద నిరసన చేస్తున్న గోపాలన్

కాళ్ల: బొండాడలో పేదల ఇళ్లు కూల్చడం క్రూరత్వమని సీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. మండలంలోని బొండాడ మెయిన్ రోడ్‌లోని పేదలు కూల్చిన ప్రదేశానికి గురువారం గోపాలన్ వెళ్లి పరిశీలించి పేదలతో మాట్లాడారు. అనంతరం బొండాడ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో బుల్డోజరు రాజకీయాలు పేదలకు నిలువ నీడ లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి పేరుతో పేదల ఇల్లు కూల్చి సంపన్నులకి భూమిని దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఇల్లు కూల్చిన పేదలకి వెంటనే ఇళ్ల స్థలాలు ఇచ్చి తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంతవరకు నివాస ప్రాంతంలోనే ఉండేలాగా అనుమతి ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లను కోరారు. సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ ఇంత దారుణమైన పరిస్థితి మన రాష్ట్రంలో ఎక్కడా లేదని ప్రజలు తమకు అవకాశం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని, చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులతో పాటు నివాస ఇళ్లు కోల్పోయిన పేదలు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేది కళారూపాలే



రంగస్థల దినోత్సవంలో మాట్లాడుతున్న సత్యప్రసాద్

భీమవరం: ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేది ఒక్క కళారూపమేనని అలాంటి కళ రూపానికి ప్రపంచ వ్యాప్తంగా సాంస్కృతిక వారసత్వం ఉందని వైజాగ్‌కు చెందిన మందులు ఆర్ట్స్ థియేటర్స్ అధ్యక్షుడు కొడమంచిలి సత్యప్రసాద్ అన్నారు. గురువారం ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా భీమవరంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి పట్టణ రంగస్థలం కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1964లో ప్రపంచ రంగస్థలం కార్యక్రమం ప్రారంభించిన నాటి నుంచి కళల ప్రాముఖ్యతను చాటి చెప్పడం కళాకారుల వంతైందన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.సీతారామ్‌ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అల్లు రామకృష్ణ, కళారంజిని వ్యవస్థాపక అధ్యక్షుడు జవ్వాది దాశరధి శ్రీనివాస్, అల్లు వంశీ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి అనుమానాస్పదం



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్

భీమవరం అర్బన్: రాజమండ్రిలోని కొంతమూరు వద్ద పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి చెందడం అనుమానస్పదంగా ఉందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. మండలంలోని చినఅమిరం గ్రామంలో గురువారం మాల మహానాడు ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహనాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ మాట్లాడుతూ కొంతమంది సామాజిక మాధ్యమాల్లో మతాలను రెచ్చగొట్టడం పరిపాటి అయిపోయిందని వారిపై ప్రభుత్వాలు కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మతాన్ని గౌరవించాలన్నారు. గత కొన్ని రోజులుగా పాస్టర్ ప్రవీణ్ పగడాలను చంపేస్తానని బెదిరిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని విచారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నేతల సువర్ణరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటి సుందర్ కుమార్, దాసరి చిరంజీవి, పిట్టా వినోద్‌కుమార్, చిగురుపాటి రాజేష్, నేతల సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కలో పోషకాలు మెండు



సిద్ధాపురంలో సూచనలిస్తున్న జేడీ జెడ్.వెంకటేశ్వర్లు

ఆకివీడు: పంట, మురుగు కాల్వల్లో విపరీతంగా పెరిగిపోయే గుర్రపుడెక్కను సద్వినియోగం చేసుకుని వర్మీ కంపోస్టు తయారీకి వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలో వర్మీ కంపోస్టు యార్డును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుర్రపుడెక్క రైతులను తీవ్ర ఇబ్బందికి గురి చేస్తుందన్నారు. పంట, మురుగు కాల్వలో వీటిని లక్షలు, కోట్లు ఖర్చుచేసి తొలగిస్తున్నా మళ్ళీ, మళ్ళీ వచ్చేస్తుందన్నారు. గట్లపై పారవేసిన ఫలితం ఉండటంలేదన్నారు. గుర్రపుడెక్కను వినియోగించి వర్మీ కంపోస్టు తయారుచేయాలని సూచించారు. వర్మీ కంపోస్టు తయారు చేసే కుండీల్లో పొరలు పొరలుగా పశువుల పేడ, వ్యర్థాలు, గుర్రపుడెక్క వేయాలన్నారు. దీనిపై డీ కంపోజర్స్‌ను వాడుకోవాలని సూచించారు. వారానికి ఒకసారి కలియబెడుతూ ఉంటే గుర్రపుడెక్క కంపోస్టు తయారవుతోందన్నారు. ఈ పద్ధతిని సిద్ధాపురం గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలుజేస్తున్నట్లు వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ కె.శ్రీనివాసరావు, ఎంఏఓ ప్రియాంక, ఏపీఎం శేషవేణి తదితరులు పాల్గొన్నారు.

ఒక్క రోజులోనే రూ.27 లక్షల వసూళ్లు



పన్నులు చెల్లిస్తున్న వినియోగదారులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పురపాలక సంఘంలో ఆస్తి పన్ను బకాయిలు చెల్లించడంలో వినియోగదారులు వేగం పెంచారు. బుధవారం ఒక్క రోజులోనే రూ. 27 లక్షలు వసూళ్లు అయినట్లు మునిసిపల్ రెవెన్యూ ఆఫీసర్ శివాజీ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ డిస్కౌంట్‌తో వినియోగదారులు పెద్ద ఎత్తున ఆస్తి పన్నులు చెల్లించడానికి ముందుకు వస్తున్నారన్నారు. పట్టణంలో మొత్తం 15085 అసెస్‌మెంట్‌లు ఉన్నాయని వీటి నిమిత్తం రూ. 8.27 కోట్లు ఆదాయం రావాల్సి ఉందన్నారు. బుధవారం నాటికి 71.78 శాతంతో రూ. 5.39 కోట్లు వసూళ్లు అయ్యాయన్నారు. ఇంకా 2.88 కోట్లు వసూళ్లు అవ్వాల్సి ఉందన్నారు. అలాగే నీటి పన్ను బకాయిలు రూ. 3.03 కోట్లకు గాను ఇప్పటి వరకూ 52.20 శాతంతో రూ. 1.58 కోట్లు వసూళ్లు అయ్యిందన్నారు. ఇంకా రూ. 1.45 కోట్లు వసూళ్లు కావాల్సి ఉందన్నారు. పాలకొల్లు మునిసిపాలిటీ ఆస్తిపన్ను వసూళ్లు మూడవ స్థానంలో ఉండగా నీటి పన్ను వసూళ్లలో మొదటి స్థానంలో ఉంది.

అమరుల త్యాగాలు మరువలేనివి

పాలకొల్లు సెంట్రల్: వర్గీకరణ కోసం మరణించిన అమరుల త్యాగాలు మరువలేనివని సనమండ ఎబినేజర్ అన్నారు. గురువారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఆదేశాల మేరకు వర్గీకరణ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గాంధీబొమ్మల సెంటర్‌లో ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పసుపులేటి చినబాబు, పసల బోసు, పసుపులేటి నందబాబు, సవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

భీమవరం అర్బన్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కార్పొరేషన్లకు సంబంధించి అందించే రుణాలకు దరఖాస్తుదారులను ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ ఎస్.మురళీ గంగాధర్, గొల్లవానితిప్ప యూనియన్, స్టేట్ బ్యాంకుల మేనేజర్లు కె.దివ్య, కొల్లాటి ఏడుకొండలు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కొత్తపూసలమర్రు, దొంగపిండి, తోకతిప్ప, నాగిడిపాలెం, కోమటితిప్ప నార్త్, దెయ్యాలతిప్ప తదితర గ్రామ పంచాయతీలకు చెందిన 171 మందిని ఇంటర్వ్యూ చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

పెనుగొండ: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శి రత్నాకర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఏళ్ల తరబడి కార్మికులు పని చేస్తున్నా ప్రభుత్వం టెండర్ పేరుతో కార్మికులకు సర్వీస్ లేకుండా చేస్తుందని విమర్శించారు. ఐదు సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలు పైబడి పనిచేస్తున్న కార్మికుల సర్వీసును క్రమబద్ధీకరించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ ఉన్నా ప్రభుత్వాలు ముఖం చాటేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు, సీఐటీయయూ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత కచేరీ



భీమవరం విష్ణు కళాశాలలో శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: భారతీయ శాస్త్రీయ, సంగీతం సంస్కృతిని యువతలో ప్రోత్సహించడానికి ది సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్స్ యూత్ భీమవవరం విష్ణు కళాశాలలో నిర్వహించిన కచేరీ కార్యక్రమం విద్యార్థులను ఆకట్టుకుంది. ప్రఖ్యాత వీణ కళాకారుడు ముదికొండన్ ఎస్ఎన్ రమేష్ , మృదంగం విద్వాంసుడు కె.స్వామినాథన్, ఘటం విద్వాంసుడు ఎన్.రాజారామన్ తమ ప్రదర్శనతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో కళాశాల సమన్వయకర్తలు జేవీ నర్సింహరాజు, జి.రత్నకాంత్, పీవీఎన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని

వీరవాసరం: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని తెలిపారు. మడుగు పోలవరం లంక గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను గురువారం సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. పాఠశాలలో ఈ ప్రాంతంలో ఉన్న విద్యార్థులను అధిక సంఖ్యలో జాయిన్ చేసేలా ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభివృద్ధి అధికంగా ఉంటుందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఎరకరాజు చినబాబు ,సుబ్రహ్మణ్యం రాజు, దొంగ ఏసుబాబు, రాజు తదితరులు పాల్గొన్నారుఉ.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: ఆరోగ్య పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని, ప్లాస్టిక్ నిషేధం మనందరి బాధ్యత అని భీమవరం పట్టణం చినరంగనిపాలెంలోని పస్తులసాగరం మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కోడే వెంకటరావు అన్నారు. భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురువారం ప్లాస్టిక్ నిషేధ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పాఠశాల ఎకోక్లబ్ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా పనుల పరిశీలన

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామంలోని మంచినీటి సరఫరా పనులను ప్రభుత్వ సలహాదారు ప్రభాకరరావు, ఓఎస్‌డీ కె.వెంకట కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి అరుణశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గురువారం పరిశీలించారు. మంచినీటి సరఫరాలో ఉన్న లోపాలు సరిజేసి, ఫిల్టర్ నీరు అందజేయాలని ఆదేశించారు. అయితే పారిశుద్ధ్య కార్మికులు తమకు జీతాలివ్వడం లేదని అధికారుల వద్ద వాపోయారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊసల బేబీ స్నేతు, పాతపాటి శ్రీనివాస రాజు,కట్రెడ్డి మోహనరావు, కఠారి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

పాలకోడేరు: మండలంలోని కుముదవల్లి గ్రామానికి చెందిన తాళం రామకృష్ణ అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో తాళం రామకృష్ణ వద్ద ఏడు మద్యం సీసాలు దొరకడంతో అతని పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.బలరామ రాజు తెలిపారు.

మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

భీమవరం: ప్రతి ఒక్క ముస్లిం భక్తి, శ్రద్ధలతో ఆత్మను, శరీరాన్ని శుద్ధి చేసుకుంటూ, పేద ప్రజలకు దానధర్మాలను అవలంబించడం పవిత్ర రంజాన్ మాసం ప్రతీక అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంజాన్ పరిష్కరించుకుని భీమవరం ఎల్ హెచ్ టౌన్ హాల్‌లో ×ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ కార్పొరేషన్ అధికారి ఎస్ఎస్ కృపా వర్మ తదితరులు పాల్గొన్నారు.